


కొత్త... కొత్తగా

ఉట్టిపడిన ఉగాది శోభ

కలెక్టరేట్‌లో ఘనంగా వేడుకలు

ఆకట్టుకున్న పంచాంగశ్రవణం, సాంస్కృతిక ప్రదర్శనలు



సాంస్కృతిక కార్యక్రమాల్లోని ఓ దృశ్యం



ఉగాది వేడుకలకు ఎద్దులబండిలో కలెక్టరేట్‌కు వస్తున్న కలెక్టర్, జేసీ, ఆర్డీఓ



ఉగాది ఉత్సవాలకు సంప్రదాయ దుస్తుల్లో హాజరైన కలెక్టర్, జేసీ, ఇతర అధికారులు



రాశిఫలాలు చెబుతున్న వేద పండితుడు

అనంతపురం టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది ఉత్సవాలను ప్రభుత్వం తరపున జిల్లా యంత్రాంగం ఆదివారం అట్టహాసంగా నిర్వహించింది. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఉగాది వేడుకలను తెలుగింటి సంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహించారు. కలెక్టరు డాక్టరు వినోద్‌కుమార్, జాయింట్‌కలెక్టరు శివనారాయణశర్మ, అనంతపురం ఆర్డీఓ కేశవ నాయుడు తెల్లచొక్కాలు, పంచెకట్టి, కండువాలు వేసుకొని ఎద్దుల బండిని తోలుకుంటూ కలెక్టరేట్‌లో జరుగుతున్న ఉగాది వేడుకలకు హాజరుకావడం అందరినీ ఆకట్టుకుంది. వేడుకలకు హాజరైన వివిధశాఖల జిల్లా ఉన్నతాధికారులు, పార్టీల ప్రజాప్రతినిధులు, సేవారంగాల ప్రతినిధులు సైతం సంప్రదాయ దుస్తులను ధరించి వేడుకలకు హాజరుకావడం మరింత ఆకట్టుకుంది.

సీఎం ఆశయాలకు అనుగుణంగా పని చేద్దాం: కలెక్టరు

రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో తపన పడుతున్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేద్దామని అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీ విశ్వావసు నామ ఉత్సవాలను అనంతలో ఘనంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ని స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా చేపట్టాల్సి ఉందన్నారు. హార్టికల్చర్‌లో జిల్లా తలసరి ఆదాయం రాష్ట్రంలోని గోదావరి ప్రాంతాల కన్నా ఎక్కువగా ఉందన్నారు. మరింత సంతృప్తి స్థాయికి తీసికెళ్లేందుకు కలిసి పని చేద్దామన్నారు. అన్నిరంగాలల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వసంతబాబు, డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, ఆనంద్, రామ్మోహన్, సీపీఓ అశోక్‌బాబుతోపాటు వివిధశాఖల ఉన్నతాధికారులు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. దివ్యశ్రీ, కావ్య, శుభమంగల ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి, అన్నమాచార్యుల కీర్తనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కవులు ఏలూరు యంగన్న, రాజారాం, చంద్రశేఖర్‌శాస్త్రి, వెంకటేశ్వరప్రసాద్, వన్నప్ప నిర్వహించిన కవిసమ్మేళనం ఆసక్తిగా సాగింది. వేదపండితులు సీతారామమోహన్‌శర్మ ఉగాది పండుగ సందర్భంగా భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర ప్రగతి తదితరవాటి గురించి తెలియజేశారు.

రేపే పింఛన్ల పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మంగళవారం ఉదయం 7గంటల నుంచే ప్రారంభిస్తామని డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఏప్రిల్ నెలకు సంబంధించి జిల్లాకు 2,79,165మంది లబ్ధిదారులకు రూ.123.76కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మొదటి రోజు వివిధ సాంకేతిక కారణాలతో పింఛన్ అందుకోని లబ్ధిదారులకు రెండో రోజు ఇళ్లవద్దనే అందజేస్తారని తెలిపారు. రంజాన్ పండుగ అయినప్పటికీ ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా సోమ వారం అన్ని బ్యాంకులు పని చేస్తాయన్నారు. సోమవారం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఆయా బ్యాంకులలో పింఛన్ సొమ్మును డ్రా చేసుకుని మంగళవారం ఉదయం లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేస్తారన్నారు.

4 నుంచి స్లాట్ బుకింగ్

రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందుబాటులోకి రానున్న సేవలు

అనంతపురం క్రైం, మార్చి30(ఆంధ్రజ్యోతి): నగరంలోని రామ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానం ఏప్రిల్ 4 నుంచి అమలులోకి రానున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. దీంతో ప్రజలకు పడిగాపులు తప్పనున్నాయన్నారు. రోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ విధానం అమలులో ఉంటుందన్నారు. ముందుగానే స్లాట్ బుక్ చేసుకుని, నిర్దిష్ట సమయానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చన్నారు. త్వరలోనే జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానం అమలు చేస్తామని ఆయన వెల్లడించారు.



కసాపురంలో గరుడ వాహనోత్సవం

గుంతకల్లు, మార్చి30(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని కసాపురం దేవస్థానంలో ఆదివారం రాత్రి గరుడ వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. నెట్టికంటి మూల విరాట్టుకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీసీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి, గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.



నాడు గోతులతో ఉన్నరోడ్డు

రోగం కుదిరింది..!

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన మంత్రి కేశవ్

పయ్యావుల చొరవతో గడేకల్లు బీటీ రోడ్డు పూర్తి



కొత్తగా వేసిన తారు రోడ్డు

విడపనకల్లు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రోగాలు తెచ్చిన రహదారి మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో బాగుపడింది. మండలంలోని గడేకల్లు గ్రామంలో ఐదేళ్ల కిందట నిలిచిన పనులు ప్రస్తుతం బీటీ రోడ్డు వేయడంతో ముగిశాయి. ఈ రోడ్డు పనులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు వైసీపీ ప్రభుత్వంలో ధర్నాలు, రాస్తారోకోలు చేసినా పట్టించుకోలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 11న 'ఆంధ్రజ్యోతి'లో రోగాలు తెచ్చి రహదారి శీర్షికన ఓ కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవతో రోడ్డు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో సీజీఆర్ కన్‌స్ట్రక్షన్ వారు రోడ్డు పనులు చేపట్టారు. వారం రోజుల కిందట గడేకల్లు గ్రామంలో బీటీ రోడ్డు (తారురోడ్డు) పనులు చేపట్టి పూర్తి చేశారు. దీంతో గడేకల్లు, డొనేకల్లు గ్రామాల ప్రజలకు దుమ్ము, ధూళి సమస్య పూర్తిగా తీరి పోయింది.

నేడు ఈద్-ఉల్-ఫితర్

వేడుకలకు సిద్ధమైన ఈద్గాలు, మసీదులు

అనంతపురం కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ నేపథ్యంలో ఈద్గాలు, మసీదులు ముస్తాబయ్యాయి. ఆదివారం సాయంత్రం మసీదుల్లో ప్రార్థనలు ముగిసిన అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. సోమవారం జరుపుకోనున్న ఈద్-ఉల్-ఫితర్(రంజాన్)ను పురస్కరించుకుని ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఈద్గాలు, మసీదులను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. నూతన రంగులు వేయడంతోపాటు విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఈద్గా మైదానంలో ఏర్పాట్లు పూర్తి

జిల్లా కేంద్రంలో డ్రైవర్స్‌కాలనీలోని ఈద్గా మైదానంలో పెద్దసంఖ్యలో ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం నగరపాలక సంస్థ సిబ్బంది ఈద్గా మైదానానికి చేరుకుని షామియానాలు ఏర్పాటు చేయించి, నీటి వసతి కల్పించారు. ప్రార్థనలకు హాజరయ్యే ముస్లింలు మైదానంలోకి చేరుకునేందుకు రెండు ద్వారాలను ఏర్పాటు చేశారు.



రహమత్‌నగర్ బ్రిడ్జి వద్ద అలంకరణలో బాబానగర్ మసీదు

నెలరోజుల దీక్షకు సార్థకత



నెలరోజులపాటు చేపట్టిన కఠిన ఉపవాస దీక్షకు ఈద్-ఉల్-ఫితర్‌తో సార్థకత చేకూరుతుంది. రంజాన్ రోజు చేసే ప్రార్థనలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. ఉపవాసాలతో శరీరాన్ని, మనసును పవిత్రం చేసుకుని ఆధ్యాత్మిక భావజాలంతో సాగే అతిపెద్ద పండుగ రంజాన్. అన్ని మతాలవారి మధ్య సయోధ్య, ఐక్యత, సోదరభావం పెంపొందాలని రంజాన్ సందర్భంగా అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నా. సోమవారం జరిగే రంజాన్ ప్రార్థనల్లో భాగంగా పాతూరులోని నమాజ్ కట్ట మసీద్‌లో ఉదయం 6.40 గంటలకు, నూరాని మసీద్‌లో 8 గంటలకు, సప్తగిరి సర్కిల్ జామియా మసీద్‌లో 9 గంటలకు, డ్రైవర్స్ కాలనీలోని ఈద్గాలో ఉదయం 10 గంటలకు ప్రార్థనలు ప్రారంభిస్తామన్నారు.

-కేఎం షకిల్ షఫి, ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

కన్నుల పండువగా తెప్పోత్సవం





తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, అలంకరణలో ముసలమ్మ

బుక్కరాయసముద్రం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిక్కవడాయార్ చెరువులో ఆదివారం నిర్వహించిన ముసలమ్మతల్లి తెప్పోత్సవం కన్నుల పండువగా సాగింది. ముసలమ్మతల్లి దేవాలయం కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ తెప్పోత్సవంను తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. చెరువులో దాదాపు మూడు కిలో మీటర్ల మేర జరిగిన ఈ తెప్పోత్సవం ఆద్యంతం ఆసక్తిగా సాగింది.

పరిటాల సునీతపై పాట

వెంకటాపురంలో సీడీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే, పరిటాల శ్రీరామ్



సీడీని ఆవిష్కరిస్తున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

రామగిరి, మార్చి30(ఆంధ్రజ్యోతి): రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత జీవిత పోరాటాలు, రాజకీయ జీవితంపై మరో పాటను రూపొందించారు. ఈ సీడీని వెంకటాపురంలో ఆదివారం ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని జీడిమెట్లకు చెందిన తాతినేని సాయిచరణ్(బాబి)ఈ పాటకు రూపకల్పన చేశారు. మొత్తం తెలంగాణ మాండలికంలో ఉన్న ఈ పాటను ప్రముఖ గాయకుడు నల్గొండ గద్దర్(నరసన్న)తో పాడించారు. పోరాటాల పొద్దుపునీవే అమ్మా సునీతమ్మ...పేద బిడ్డల తల్లివే సునీతమ్మ అంటూ ఈ పాట మొదలవుతుంది. ఈ పాటలో ఎమ్మెల్యే నిజజీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, పార్టీ కోసం చేసిన పోరాటాలు, ఆమె మంత్రిగా, ఎమ్మెల్యే ఉన్నప్పుడు అందించిన సేవలు తదితర అంశాలను పొందుపరిచారు. ఈ సందర్భంగా సాయిచరణ్ మాట్లాడుతూ... తాను మొదటినుంచి పరిటాల అభిమానిగా ఉన్నానని, ఆ కుటుంబంపై ప్రేమతోనే ఈ పాటను తయారు చేశానన్నారు.

రేపట్నుంచి సదరం స్లాట్స్

అనంతపురం టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సంబంధించి వికలాంగత్వం, దీర్ఘకాలిక రోగులకు వ్యాధి నిర్ధారణ సర్టిఫికెట్లకు సదరం స్లాట్స్ మంగళవారం ఓపెన్ కానున్నాయి. నకిలీ దివ్యాంగుల ఏరివేతే లక్ష్యంగా ఇటీవ రాష్ట్ర ప్రభుత్వం వెరిఫికేషన్ చేయిస్తోంది. ఈఏడాది జనవరి నుంచి ఈ రీవెరిఫికేషన్ పక్రియను కొనసాగిస్తు న్నారు. ఇంకా ఈప్రక్రియ జరుగుతున్నా అనేక మంది దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాదిగ్రస్తులు పింఛన్ల కోసం సదరం సర్టిఫికెట్లను పొందడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ ఒకటి నుంచి సదరం స్లాట్స్ తిరిగి ప్రారంభించాలని రాష్ట్ర వైద్యశాఖ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే అధికారికంగా సంబంధిత వైద్యశాఖ కమిషనర్ ప్రకటించారని డీసీహెచ్‌ఎస్ డాక్టరు పాల్ రవికుమార్ తెలిపారు. అయితే గతంలో ఉన్నన్ని సదరం ఆస్పత్రులు ఉండకపోవచ్చని, వారానికి రెండురోజులు మాత్రమే సదరం ఉండే అవకాశం ఉందన్నారు.

అయ్యో.. అమ్మా.. నాన్నా..!



రోదిస్తున్న కృష్ణాచారి తల్లి, కుటుంబ సభ్యులు



ఇంట్లో విగత జీవులుగా పడి ఉన్న కృష్ణాచారి, భార్య, కుమారులు

మడకశిరటౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో శనివారం పట్టణంలోని గాంధీ బజార్‌కు చెందిన బంగారం వ్యాపారి కృష్ణాచారి (55), సరళ (39) దంపతులు.. తమ కుమారులు సంతోష్ (15), భువనేశ్ (13)కు విషమిచ్చి, అనంతరం వారూ తాగి ఆత్మహత్య చేసుకున్నారు. నలుగురూ చనిపోయారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఉగాది పండుగ రోజునే ఇంటిలోనూ వారందరూ మరణించడంతో బంధువులు విషాదంలో మునిగిపోయారు. కృష్ణాచారి తల్లి రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న ఎస్పీ రత్న ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో శోధించినా ఎలాంటి ఆధారాలూ లభించలేదు. కృష్ణాచారి జేబులో సైనైడ్ దొరికింది. దానిని తాగి, ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. కొత్త ఇంటిని నిర్మించుకొని, కృష్ణాచారి వేరుగా ఉంటున్నట్లు కుటుంబీకులు తెలిపారు. కొంత భూమి కూడా ఉందని బంధువులు తెలిపారు.

కష్టాలు తెలియకుండా పెంచుతున్నారు..
కన్నీరు కార్చకుండా చూసుకుంటున్నారు..
మీ ఒడిలో సేదతీరాం..
మీ భుజాలనెక్కి ఆడుకున్నాం..
మా ప్రపంచమే మీరు..

మేం అడిగినవన్నీ ఇస్తున్నారు..
మా అల్లరిని ఆనందంగా భరిస్తున్నారు..
మేమే లోకం అనుకున్నారు..
మా కోసమే బతుకుతున్నారు..
మీ పంచ ప్రాణాలు మేము..

ఉగాది వచ్చేసింది..
అమ్మానాన్నతో ఆనందంగా గడపాలని..
పండుగ చేసుకోవాలని వచ్చాం..
మీరు నీళ్లస్తే తాగాం..

మమ్మలను ఆడించి లాలించిన చేతులే..
విషం ఇస్తాయనుకోలేదు..
మీ కళ్లముందే మేం తల్లడిల్లుతుంటే..
మీ గుండెలు పగిలి.. ఎలా
రోదించి ఉంటారో తెలుసు..
ఎన్నో కష్టాలు పడి.. మమ్ములను పెంచింది..
ఇందుకోసమేనా..?
మమ్ములను చంపి..
మీరు ఆత్మహత్య చేసుకునేందుకేనా..?

ఎంత పెద్ద కష్టమైనా.. ఎదురించి..
పోరాడి ఉండుంటే...
కచ్చితంగా గెలిచేవారు..
అందరం ఆనందంగా ఉండేవారం..
ఒక్కసారి ఆలోచించాల్సింది..
అమ్మానాన్నా..

ప్రభాకర్ చౌదరికి కళారత్న అవార్డు



సీఎం చంద్రబాబు నుంచి కళారత్న అవార్డు అందుకుంటున్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరికి సామాజిక సేవల విభాగంలో కళారత్న (హంస) అవార్డు ప్రదానం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో అవే సంస్థ వ్యవస్థాపకులు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరికి సీఎం చంద్రబాబు కళారత్న అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా పీ-4 కార్యక్రమం నిర్వహణ కోసం వైకుంఠం ప్రభాకర్ చౌదరి తన వంతుగా రూ.లక్షను సీఎం సహాయ నిధికి అందజేశారు. అవార్డు అందుకున్న ప్రభాకర్ చౌదరికి పలువురు టీడీపీ నాయకులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

చరిత్ర పరిశోధకుడు మైనాస్వామికి..



అవార్డు అందుకుంటున్న మైనాస్వామి

గోరంట్ల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరావులపల్లి గ్రామానికి చెందిన చరిత్ర పరిశోధకుడు మైనాస్వామికి ఉగాది పురస్కారం లభించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆదివారం ఆయన పురస్కారం అందుకున్నారు. చారిత్రక పరిశోధనలు, శిలా శాసనాలు, పురాతన ఆలయాల విశిష్టతను వెలికి తీయడంలోనూ, పత్రిక ద్వారా బహ్య ప్రపంచానికి తెలియజేయడంలో ఆయన విశిష్టసేవలు అందించారు. అందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాలకు ఎంపిక చేసి, అవార్డు అందజేసింది. విజయవాడ వద్ద గల తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మైనాస్వామికి సత్కారం జరిగింది.

శవమై తేలిన చేనేత కార్మికుడు

సోమందేపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సోమందేపల్లి చెరువు సమీపంలో హంద్రీనీవా కాలువలో శనివారం సాయంత్రం గల్లంతైన చేనేత కార్మికుడు కృష్ణారెడ్డి(44) ఆదివారం శవమై తేలాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది సంఘటనా స్థలానికి శనివారం వెళ్లి గాలించారు. ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం మరోమారు గాలించారు. నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గుర్తించి, బయటకు తీయించారు. పోలీసుల తెలిపిన మేరకు కృష్ణారెడ్డి తరచూ ఈతకు వెళ్లేవాడు. ఈ క్రమంలో శనివారం ద్విచక్రవాహనంపై హంద్రీనీవా కాలువ వద్దకు వెళ్లి అందులో దూకాడు. కాలువలో ఉన్న ముళ్లకంపలు తగులుకుని ప్రమాదవశాత్తు మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య కళావతి, కుమారుడు యుగంధర్‌రెడ్డి, కుమార్తె ఇందు ఉన్నారు.

రోడ్డుపై మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొత్తచెరువు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్ల కుంట క్రాస్ రోడ్డు డివైడర్‌పై గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. ఆ మృతదేహం తమ పరిధిలోకి రాదని పుట్టపర్తి పోలీసులు, తమ పరిధిలోకి రాదని కొత్తచెరువు పోలీసులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ రోడ్డుపైనే వదిలేశారు. ఈ అమానుష ఘటన చూసి చుట్టు పక్కల వాళ్లు అయ్యో ఇంత దారుణమా ఒక మనిషి చనిపోతే పోలీసులకు కరుణలేదాఅని చర్చించుకుంటున్నారు. చివరికి ఉన్నతాధికారుల జోక్యంతో కొత్తచెరువు పోలీసులు పెద్దల సమక్షంలో పంచనామా చేసి అంత్యక్రియలు నిర్వహించారు.

టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ

వైసీపీ కార్యకర్త మృతి... కుమారుడికి తీవ్రగాయాలు

రామగిరి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లిలో ఆదివారం తలెత్తిన ఘర్షణలో వైసీపీ కార్యకర్త లింగమయ్య (60) మృతిచెందగా.. అతడి కుమారుడు శ్రీనివాసులు గాయపడ్డాడు. లింగమయ్య భార్య రామాంజినమ్మ.. పోలీసులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లింగమయ్య పెద్ద కుమారుడు మనోహర్ మూడు రోజుల క్రితం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఆదర్శ్‌తో చిన్నపాటి గొడవ పడ్డాడు. ఆదివారం ఉదయం గ్రామంలో మరోసారి వారు గొడవపడ్డారు. విషయాన్ని మనోహర్.. తండ్రి లింగమయ్యకు తెలిపాడు. దీంతో లింగమయ్య.. ఆదర్శ్, అతడి కుటుంబీకుల పట్ల నానా దుర్భాషలాడాడు. కులం పేరుతో దూషించాడు. విషయాన్ని పలువురు.. ఆదర్శ్‌కు తెలిపారు. ఆగ్రహానికి లోనైన అతడు.. తన బంధువైన నాయుడు, మరికొందరితో కలిసి లింగమయ్య ఇంటి వద్దకెళ్లి, గొడవపడ్డాడు. కర్రలతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. అడ్డువచ్చిన లింగమయ్య చిన్న కుమారుడు శ్రీనివాసులుపై కూడా దాడి చేశారు. వారికి తీవ్రగాయాలవడంతో ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి లింగమయ్యను అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ రత్న గ్రామానికి చేరుకుని, పరిశీలించారు. లింగమయ్య భార్య రామాంజినమ్మ ఫిర్యాదు మేరకు రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్.. ఆదర్శ్, నాయుడుపై కేసు నమోదు చేశారు.



గ్రామంలో పర్యటిస్తున్న ఎస్పీ రత్న



లింగమయ్య మృతదేహం


వ్యక్తిగత గొడవలను పార్టీలకు ఆపాదించవద్దు

పాపిరెడ్డిపల్లి ఘటనపై ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

ధర్మవరం(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లిలో ఆదివారం జరిగిన ఘటనకు రాజకీయాలతో సంబంధంలేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. గ్రామంలో ఉగాది పండుగ నేపథ్యంలో కొందరు తమ పెద్దల సమాధులు, దేవాలయాల వద్ద పూజలు చేసి వస్తుండగా చిన్న ఘటనతో గొడవ మొదలైందన్నారు. క్షణికావేశంలో పరస్పరం దాడులు చేసుకున్నారన్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి మృతిచెందడం చాలా బాధాకరమన్నారు. గ్రామాల్లో వ్యక్తిగత గొడవలతో జరిగిన ఘటనలను కూడా వైసీపీ నాయకులు.. పార్టీలకు, రాజకీయాలకు, కులాలకు ఆపాదిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. పాపిరెడ్డిపల్లిలో ఎలాంటి ఫ్యాక్షన్ గొడవలు లేవని వారు తెలిపారు. ఒక వ్యక్తి మరణాన్ని రాజకీయంగా వాడుకునేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారనీ, ఇలాంటి వాటిని ప్రజలు నమ్మవద్దన్నారు. పాపిరెడ్డిపల్లి ఘటన పూర్తిగా వ్యక్తిగత కారణాలతోనేనని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఫ్యాక్షన్, రాజకీయ గొడవలను తెలుగుదేశం పార్టీ మరీ ముఖ్యంగా పరిటాల కుటుంబం ప్రోత్సహించదని పరిటాల సునీత, పరిటాలశ్రీరామ్ స్పష్టం చేశారు.



అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



ప్రభుత్వ ఆఫీసులో

ప్రైవేటోళ్ల రాజ్యం..!

అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల హవా

ఒకరు పద్దులు రాస్తే..
మరొకరు
వసూలు చేస్తారు..
ప్రతి వారం రూ.40వేల
నుంచి రూ.50వేలుపైనే
ఆదాయం
డీఆర్ ఆదేశాలూ
డోంట్ కేర్

అనంతపురం క్రైం, మార్చి30(ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల పెత్తనం ఎక్కువగా ఉంటుంది. ఏదో పని మీద వచ్చి ఉద్యోగుల మాదిరిగా సెటిలైపోయారు. ఉద్యోగులకూతే బదిలీ ఉంటుంది... వీరికి ఆ ఇబ్బంది కూడా ఉండదు. ఏళ్లపాటు కొనసాగుతూ.. కార్యాలయాన్నే తమ గుప్పిట్లోకి తెచ్చుకున్నారు. అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల రాజ్యం నడుస్తోంది. ఒకరు సీరియస్‌గా కంప్యూటర్ చూస్తూ... డాక్యుమెంట్ల వివరాలు చెక్ చేస్తుంటాడు. అతడు పెద్ద ఆఫీసరేమోనని ఆఫీసుకు వచ్చే వారు సార్ అని పిలుస్తుంటారు. అతనో ప్రైవేటు వ్యక్తి. మరొకరు టిఫిన్లు, భోజనాలు ఇతరత్రా అవసరమైన వాటిని తెచ్చిస్తాడు. అతనూ ప్రైవేటు వ్యక్తే. చివరికి కారు డ్రైవర్‌ను కూడా పెట్టుకుంటారు. ఇదంతా కార్యాలయానికి వచ్చే ఆదాయం నుంచే చెల్లిస్తారట. రోజువారీగానీ, వారానికోసారిగానీ డబ్బు పంచేసుకుంటారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఆ లెక్క కూడా ఒక్కొక్కరికి ఒక్కోలా ఉంటుంది. ఇక్కడ ఓ సీనియర్ అసిస్టెంట్, ముగ్గురు ప్రైవేటు వ్యక్తులు అన్నింటా తామై వ్యవహారం నడుపుతున్నారు.



చక్రం తిప్పుతున్న సీనియర్ అసిస్టెంట్

అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ సీనియర్ అసిస్టెంట్ చక్రం తిప్పుతున్నారు. ఆదాయమే పరమావధిగా ఆయన పనిచేస్తుంటారన్నది బహిరంగ రహస్యమే. గతంలో రాంనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే సమయంలో రిజిస్ట్రేషన్ల విషయంలో ఆయన నడిపిన వ్యవహారం అంతా ఇంతా కాదు. ఆ సమయంలో బాగానే ఆర్జించిన ఈయన ఇక్కడా అదే వ్యవహారం నడుపుతున్నారు. వచ్చిన కొత్తలో అసైన్డ్, చుక్కల భూమి, భాగపరిష్కారాలు ఇలా ఎలాంటి సబ్జెక్టయినా రిజిస్ట్రేషన్ చేస్తూ సొమ్ము చేసుకున్నారు. ఓ సందర్భంలో సబ్‌రిజిస్ట్రార్ లాగిన్‌లోనే సమీప భూములకు సంబంధించి రెండు డాక్యుమెంట్లు చేసి వివాదానికి కారణమయ్యారు. మరి ఆ ఇద్దరి మధ్య ఏం నడిచిందో కానీ, అది సద్దుమణిగినట్లు తెలిసింది. ఆ రెండింటి నుంచి రూ.లకారాల్లోనే లబ్ధి పొందినట్లు సమాచారం. సమీపంలోని ఓ మండల పరిధిలో ఎకరం వివాదాస్పద భూమికి ఎనీవేర్ కింద రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. అక్కడ డాక్యుమెంట్ చేయడానికి అనంతపురం రూరల్‌లో ఓకే కొట్టడానికి రూ.5.50 లక్షలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. సబ్‌రిజిస్ట్రార్ సెలవులో వెళ్లినపుడు, శనివారం వస్తే ఆయనకు పండగే. తాజాగా పైఅధికారులకు అసలు విషయం తెలిసి కొంతవరకు ఆయన పవర్ కట్ చేసినట్లు సమాచారం.

ఒకరు పద్దులు.. మరొకరు వసూలు..

అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల హవా నడుస్తోంది. ఓ ముగ్గురు వ్యక్తులు కీలకంగా వ్యవహారం నడుపుతున్నారు. అందులో ఇద్దరు వ్యక్తులు... రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం 2007లో ప్రారంభమైనప్పటి నుంచి ఉన్నారు. ప్రతి రిజిస్ట్రేషన్‌కు డాక్యుమెంట్ రైటర్లు మర్యాదపూర్వకమైన ముడుపులు అందజేస్తారు. రిజిస్ట్రేషన్లు, మార్టిగేజ్‌లతోపాటు వివాదముంటే వాటికి మరింత జోడించి ఇస్తారు. ఇలా రోజూ డాక్యుమెంట్ల వారీగా ఎవరెవరివో ఓ ప్రైవేటు వ్యక్తి రాసుకుంటారు. మరో వ్యక్తి రోజు వారీగానీ, సెలవు రోజులో(వారాంతం)లోగానీ ఆ డబ్బు వసూలు చేసుకొస్తాడు. ఇలా ప్రతి వారం అందరికీ పంపకాలయ్యాక రూ.40వేల నుంచి రూ.50వేల వరకు జేబులోకి వేసుకుంటారని సమాచారం. ఆది నుంచీ ఉండటంతో అధికారులు సైతం ఏది అసైన్డ్, ఏది రిజిస్ట్రేషన్ చేయవచ్చు, ఏ భూమి విషయంలో సమస్య ఉందనేవిషయంలో ఈ ఇద్దరి సలహాలు తీసుకుంటారట.

ఆమె డామినేషన్..

ఆ ప్రైవేటు ఉద్యోగుల్లో ఒకామె మరోలా డామినేషన్ చేస్తోందట. ఆ ఆఫీస్‌కు ప్రత్యేకమట. మొన్నటివరకు రికార్డులు, డాక్యుమెంట్లు జత చేయడం వంటి పనులు చేస్తున్న ఆ ప్రైవేటు వ్యక్తిని ఏకంగా ఆఫీసులో డాక్యుమెంట్లు జరిగే చాంబర్‌లోకి ప్రవేశపెట్టారు. ఆమెకో సిస్టమ్ కూడా ఇచ్చారట. ఈ మధ్యనే అటెండర్‌తో ఈ ప్రైవేటు వ్యక్తి గొడవకు దిగి... 'మేము ఉండకూడదని చెప్పడానికి నువ్వెవరు?' అంటూ పెద్ద గొడవే చేసిందట.

డీఆర్ అంటే డోంట్ కేర్...

రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఐదుగురు ప్రైవేటు వ్యక్తులున్నారు. ఆఫీసుల్లో ప్రైవేటు వ్యక్తులు పని చేయవద్దని జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్) ఇటీవల స్పష్టమైన ఆదేశాలిచ్చారు. దీంతో వారు కొన్ని రోజులు మాత్రమే ఆఫీస్‌కు దూరంగా ఉన్నారు. మళ్లీ ఎంచక్కా రంగంలోకి దిగారు. డీఆర్ అంటే డోంట్ కేర్ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. డీఆర్ నెలరోజుల క్రితం తన వివాహం సందర్భంగా సెలవుపై వెళ్లారు. రెండ్రోజుల క్రితం ఆయన విధుల్లో చేరారు. మరి ఏ మాత్రం చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు పాముకాటు

ఉరవకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని చిన్న హోతూరు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రమోహన్ పాము కాటుతో అస్వస్థతకు గురయ్యాడు. తనిఖీల్లో భాగంగా ఆదివారం గ్రామ సమీపంలో పనులు పరిశీలించి ఇంటికి వస్తుండగా దారిలో బైకు చక్రాల కిందకు పాము దూరింది. ఆందోళనతో వాహనాన్ని అదుపు చేయలేక కిందపడ్డాడు. ఈక్రమంలో పాము కాటు వేసింది. స్థానికులు అతడిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

న్యూస్ బాక్స్

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


అలంకరణలో మౌనగిరి హనుమాన్

రాప్తాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. రాప్తాడులోని నీలకంఠేశ్వరస్వామి, మరూరు చిన్నకదరయ్య స్వామి, బండమీదపల్లి వెంకటేశ్వర స్వామి, అంజనేయస్వామి, గొందిరెడ్డిపల్లిలో ఉజ్జినేశ్వర స్వామి, యర్రగుంట నరసింహస్వామి, హంపాపురం మౌనగిరి ఆంజనేయ స్వామి, చిన్మయ్‌నగర్ వెంకటేశ్వర స్వామి, శివాలయంలో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వాములను దర్శించుకున్నారు.

పన్ను చెల్లింపునకు నేడే ఆఖరు

అనంతపురం క్రైం, మార్చి30(ఆంధ్రజ్యోతి): నగరపాలిక సంస్థ పరిధిలో ఇంటి పన్ను బకాయిల చెల్లింపు విషయంలో అపరాధ రుసుము(వడ్డీ)తో కలిపి చెల్లించే పన్నులో 50శాతం రాయితీకి సోమవారం రోజు చివరి గడువు. ఒకేసారి పన్ను చెల్లించిన వారికి వడ్డీలో 50శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం వారం క్రితం ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని కమిషనర్ బాలస్వామి తెలిపారు. పన్ను చెల్లించడానికి రంజాన్ పండుగ రోజైనా సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లలో ఉదయం 6గంటల నుంచి రాత్రి 11గంటల వరకు చెల్లించవచ్చన్నారు. 5, 17, 54, 64 సచివాలయాల పరిధిలో ఉదయం 6గంటల నుంచి రాత్రి 9గంటల వరకు పన్ను చెల్లించవచ్చన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ ఉద్యోగి మృతి

అనంతపురం క్రైం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని టీవీటవర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేట్ ఉద్యోగి మృతి చెందాడు. ఆకుతోటపల్లికి చెందిన వంశీకృష్ణ(24) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉగాది పండుగకు ఇంటికి వచ్చాడు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి ప్యాసింజర్ ఆటోలో అనంతపురం బయలుదేరాడు. టీవీ టవర్ సమీపంలోకి రాగానే ఓ బైక్ అడ్డురాగా సడన్‌బ్రేక్ వేయడంతో ఆటో అదుపుతప్పింది. దీంతో వంశీకృష్ణ కిందపడగా అతడిపై ఆటో పడింది. తీవ్రగాయాలకు గురైన అతడిని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు.

కుక్కలకు టీకాలు

అనంతపురం క్రైం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో కుక్కలకు వ్యాక్సినేషన్ ప్రారంభించినట్లు నగర కమిషనర్ బాలస్వామి తెలిపారు. సంతులన్ జీవ్ కళ్యాణ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. నగరంలోని నీరుగంటి వీధి, వేణుగోపాల్‌నగర్, ఆజాద్‌నగర్, విద్యారణ్యనగర్, కోవూరు నగర్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో కుక్కలను పట్టుకున్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న గంగారామ్, సుందర్, దాదా ఖలందర్

అనంతపురం అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకొని టీడీపీ నాయకుడు దాదా ఖలందర్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక 37వ డివిజన్‌లోని టీడీపీ నాయకుడు దాదా కలందర్ నివాసంలో ఆదివారం ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, సుందర్ చేతుల మీదుగా కార్మికులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా దాదా ఖలందర్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ చేస్తున్న అభివృద్ధిని చూసి తాను ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరానన్నారు. ఆయన సూచనల మేరకే కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 37వ డివిజన్‌లో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు. టీడీపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్, చేపల హరి, భక్తవత్సలం నాయుడు, కదిరప్ప, కరీం బాషా, బాబు, నరేష్‌కుమార్, రాజాబాబు, నాసిర్, ఇర్ఫాన్, పార్వతమ్మ, ప్రమీల, ఉమా పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక సంబరాలు


పాటలు పాడుతున్న గాయకులు

అనంతపురం కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఏపీ సృజనాత్మక సాంస్కృతిక సమితి సహకారంతో భగవాన్ సత్యసాయి బాబా నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని కృష్ణకళామందిర్‌లో నిర్వహించిన ఉగాది సాంస్కృతిక సంబరాలు వీక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా పలువురు కళాకారులు భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే సంగీత విభావరితో పాటు ప్రాచీన తోలుబొమ్మలాట ప్రదర్శిం చారు. డీఆర్‌ఓ మలోల, వీఆర్‌ఓ నాగేంద్రు సంగీత కళాకారులతో కలిసి పాటలు పాడారు. అనంతరం శ్రీకృష్ణ రాయబారం నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో నాటకోత్సవ సమితి నిర్వాహకుడు షైఖేల్‌బాబు, నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి, కళాకారులు పాల్గొన్నారు.

● అనంతపురం రూరల్: మండలంలోని శిల్పారామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం సాయంత్రం పంచాగ శ్రవణం చేపట్టారు. అనంతరం శ్రీనృత్య కళా నిలయం వారి బృందంచే భరతనాట్య నృత్య ప్రదర్శన జరిగింది. కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఏట శివప్రసాద్‌రెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

భక్తిప్రపత్తులతో 'విశ్వావసు'కు స్వాగతం




స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి

అనంతపురం కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తెలుగువారి నూతన సంవత్సరాదిని జిల్లా వాసులు ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. విశ్వావసు నామ సంవత్సరాన్ని భక్తిప్రపత్తులతో ఆహ్వానించారు. జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో విశేష పూజాకార్యక్రమాలు, పంచాంగ శ్రవణాలు నిర్వహించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరించారు. తెలుగు సాంప్రదాయాన్ని చాటుకునే రీతిలో నూతన వస్త్రాలు ధరించి పండుగ జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సందర్శనలతో కిటకిటలాడాయి. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణాలలో ప్రజలు విరివిగా పాల్గొని, కొత్త సంవత్సరాది ఫలితాలు ఎలా వుండనున్నాయో ఆసక్తిగా ఆలకించారు. లలితకళా పరిషత్‌లో సాయంత్రం వేదపండితుడు గరుడాద్రి సురేష్‌శర్మ పంచాంగ పఠనం చేశారు. అనంతరం పరిషత్ ఆధ్వర్యంలో పలువురు కళాకారులకు ఉగాది పురస్కారాలు అందజేసి సత్కరించారు.


లలితకళాపరిషత్‌లో పంచాంగ పఠనం

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయం, మొదటిరోడ్డు లోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, పాతూరు దత్తాత్రేయ మందిరం, మారుతీనగర్ రామాలయం, రామ్‌నగర్ వెంకటేశ్వరస్వామి దేవాలయం, శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమం, శృంగేరి శంకర మఠం, రామ్ నగర్ వెంకటేశ్వరస్వామి దేవాలయం, శివకోటి లలితాశివకామేశ్వరి ఆలయం, హౌసింగ్‌బోర్డులోని వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలతోపాటు పంచాంగ శ్రవణాలు నిర్వహించారు. రెవెన్యూ కాలనీ రామాలయంలో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వాసుదేవశాస్త్రి, పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో పురోహితుడు నాగవెంకట కుమారశర్మచే పంచాంగ శ్రవణం నిర్వహించారు.


అలరించిన నృత్యం


కవి సమ్మేళనం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా నరసింహస్వామి ఊరేగింపు

చెన్నేకొత్తపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురం గ్రామంలో శనివారం ప్రారంభమైన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా ఉగాది పండుగను పురస్కరించుకుని ఇక్కడ నాలుగురోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆదివారం మూడో రోజు స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి తెల్లవారుజామున నుంచి గ్రామంలో ఊరేగించారు. స్థానికులే కాకుండా చుట్టు గ్రామల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. అదేవిధంగా ఆలయం చుట్టూ పలహారపు బండ్లను తిప్పారు. సాయంత్రం స్వామివారి పంజుసేవకు కర్ణాటక ప్రాంతం నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.


అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

ఒంటికొండలో అక్కదేవతల ఉత్సవాలు: ఉగాది పండుగను పురస్కరించుకుని మండలపరిధి లోని ఒంటికొండ గ్రామంలో అక్కదేవతల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కొడప గానిపల్లి సమీపం నుంచి ప్రారంభమైన ఊరేగింపు ఆమిదాలకుంట, ప్రసన్నాయపేట, ఓబుళంపల్లి మీదుగా ఆదివారం సాగింది. ఆలయం చుట్టూ పలహారపు బండ్లు తిప్పారు.


నరసింహ స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

వివిధ గ్రామాల నుంచి భక్తులు బారీగా తరలివచ్చి అక్కదేవతలను దర్శించుకుని పూజలు చేశారు. నాలుగురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు సోమవారం పరుష, కుంకాల కార్యక్రమంతో ముగుస్తాయి.


ఒంటికొండలో అక్కదేవతల ఊరేగింపు

రాతిదూలం లాగుడు పోటీలు


రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎల్ నారాయణచౌదరి

చెన్నేకొత్తపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని చెన్నేకొత్తపల్లిలో ఆదివారం నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. ఎమ్మెల్యే పరిటాల సునీత, గ్రామస్థుల సహకారంతో ఈ పోటీలు నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వృషభాలు పాల్గొన్నాయి. టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి పోటీలను ప్రారంభించారు. ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన చెన్నప్ప వృషభాలు మొ దటి బహుమతి రూ. 50వేలు గెలుపొందాయి. గార్లదిన్నెకు చెందిన నరేశ్ వృషభాలు ద్వితీయ బహుమతి రూ. 40వేలు, బళ్లారికి చెందిన ఆనందరెడ్డి వృషభాలు మూడో బహుమతి రూ. 30వేలు, సోమలదొడ్డికి చెందిన రామసుబ్బారెడ్డి వృషభాలు నాలుగో బహుమతి రూ.20వేలను సాధించాయి. నంద్యాలజిల్లా బేతంచెర్ల మండలం హుసేనాపురానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి వృషభాలు ఐదవ బహుమతి కింద రూ.10వేలు గెలుపొందాయి. బహుమతులను ఎస్ఐ సత్యనారాయణ చేతులమీదుగా అందజేశారు. టీడీపీకి చెందిన వడ్డే శ్రీనివాసులు, వడ్డే దుర్గా అనే సోదరులు అన్నదానం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి రాతిదూలం పోటీలను ఆశక్తిగా తిలకించారు.

ఉపాధి కోసం ఎదురుచూపులు

● ఫాంపాండ్ల తవ్వకాలే చేపట్టాలన్న అధికారులు
● ఇతర పనులూ కల్పించాలంటున్న కూలీలు


తక్కువ మంది కూలీలతోనే పనులు చేయిస్తున్న దృశ్యం

నార్పల, మార్చి30(ఆంధ్రజ్యోతి): వలస కూలీల నివారణ కోసం దేశంలోనే మొట్టమొదటి సారిగా నార్పల మండలం బండ్లపల్లిలో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారు. అయితే అధికారులు ఉపాధి పనులు కల్పించకపోవడంతో, పనుల కోసం కూలీలు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఈ మండలంలోనే నెలకొంది. నార్పల మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకానికి సంబంధించి 12వేల జాబ్‌కార్డులు ఉన్నాయి. వర్షపు నీటి నిల్వ కోసం రాతి కట్టడం, వంకల్లో పూడిక తీత పనులు, కొండ దిగువ, ఎగువన ట్రెంచ్ ఏర్పాటు తదితర ఉపాధి ద్వారా చేపట్టాల్సిన ఎన్నో పనులు ఉన్నాయి. నెల రోజులుగా అధికారులు ఫాం పాండ్ల పనులు మాత్రమే నిర్వహిస్తున్నారు. దీంతో మండల వ్యాప్తంగా రెండు వేల మందికి మించి ఉపాధి కూలీలకు పనులకు వెళ్లడంలేదు. ఉపాధి ద్వారా చేపట్టాల్సిన అన్ని పనులు ఏర్పాటు చేస్తే దాదాపు ఆరు వేల మందికి పైగా పనులకు వెళ్లేవారు. ఇదిలాఉండగా ప్రస్తుతం ఎండాకాలం అయినందున ఫాం పాండ్ల పనులు చేయాలంటే, మట్టి ఎంత తవ్విన రావడంలేదని కూలీలు వాపోతున్నారు. చేతులు బొబ్బలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నార్పల మేజరు పంచాయతీ పరిస్థితికి వస్తే... పనులకు వెళ్లాల్సిన దాదాపు వేయి మంది కూలీలు ఉన్నారు. 70 మంది మాత్రమే ఫాంపాండ్ల తవ్వకాలకు వెళ్తున్నారని అధికారులు తెలిపారు. అన్ని పనులు ఏర్పాటు చేయాలని, పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా పట్టించుకోవడంలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫారం పాండ్ల పనులు చేయలేమని మరికొందరు కూలీలు అర్జీల రూపంలో అధికారులకు అందజేసినా పట్టించుకోకపోవడం గమన్హారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ఉపాధి హామీలోని అన్ని పనులు చేపట్టాలని మండలంలోని కూలీలు కోరుతున్నారు.

ఇతర పనులు కోరినా పట్టించుకోలేదు



ఉపాధి కింద ఇతర పనులు కావాలని అనేకసార్లు అధికారులకు తెలియజేశాం. కానీ ఫాం పాండ్ల పనులు మాత్రమే పెడుతున్నారు. ఎండాకాలంలో నేల గట్టిగా ఉన్నందున ఎంత తవ్వినా మట్టి బయటికి రాదు. కావున ఆ పనులు చేయలేమని అధికారులకు తెలియజేశాం అయినా కూడా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పనులు లేక ఇంటి దగ్గర ఖాళీగా కూర్చున్నా.

- నాగమ్మ, నార్పల

వ్యవసాయ పనులకు వెళ్తున్నా



ఉపాధి హామీ పనులుపెట్టక పోవడం వలన వ్యవసాయ పనులకు వెళ్తున్నా. ఎండాకాలంలో ఫాం పాండ్ల పనులు చేయలేమని ఫిల్డ్ అసిస్టెంట్‌కు చెప్పినా. ఫారం పాండ్ల పనులకు అయితే రండి, లేకపోతే వద్దని చెప్పాడు. దీంతో చేసేది ఏమీ లేక, అధికారులతో గొడవలు పడలేక వ్యవసాయ పనులకు వెళ్తున్నా.

- మేకల పెద్దన్న, నార్పల

248 ఫాం పాండ్ల పనులు మంజూరయ్యాయి



మండల వ్యాప్తంగా 248 ఫాం పాండ్ల పనులు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 30 మాత్రమే పూర్తయ్యాయి. 51 ఫాం పాండ్ల పనులు జరుగుతున్నాయి. 248 ఫాం పాండ్ల పనులు వెంటనే పూర్తి చేయాలని పై అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇందు కోసం ఉపాధి హామీలో మిగతా పనులు పక్కనపెట్టి కేవలం ఫాం పాండ్ల పనులు మాత్రమే నిర్వహిస్తున్నాం. ఉపాధి కూలీలు ఫారం పాండ్ల పనులకు తక్కువగా వస్తున్నారు.

- రమేష్ రామారావు, ఏపీఓ

వ్యసనాలకు దూరంగా ఉండాలి

● ఉజ్వల భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకోవద్దు
● యువతకు సీఐ కౌలుట్లయ్య సూచన

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ


శింగనమల సీఐ కౌలుట్లయ్య

గార్లదిన్నె, మార్చి30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో యువత దుర్వ్యసనాలకు గురై భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకుంటున్నారని, వాటికి దూరంగా ఉండాలని శింగనమల సీఐ కౌలుట్లయ్య పేర్కొ న్నారు. సీఐ కౌలుట్లయ్య ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఇంటర్వ్యూలో యువతకు పలు సలహాలు, సూచనలిచ్చారు. యువత సమాజాభివృద్ధికి తోడ్పడి సక్రమ మార్గంలో పయనించాలన్నారు. తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు.

ప్రశ్న: యువతకు మీరు ఇచ్చే సూచనలు ఏమిటి?

జవాబు: ప్రస్తుత సమాజంలో కొంతమంది యువకులు మద్యం, గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. ఆ మైకంలో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. చెడువ్యసనాలతో బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంచి జీవితాన్ని ఎంచుకోవాలి

ప్రశ్న: వ్యసనాలకు అలవాటు పడిన యువతను గుర్తించారా?

జవాబు: ఎంతోమంది యువత దురలవాట్లకు, విలాసాలకు, జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాలు, ఏటీఎం చోరీలకు పాల్పడుతున్నారు. భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ఇందుకు నిదర్శనం ఇటీవల నార్పలలో మద్యం మత్తులో ఓ యువకుడిని హత్య చేసిన ఘటనలో కొంతమంది యువకులకు శిక్ష పడడమే.

ప్రశ్న: వ్యవసాయ తోటల్లోని విద్యుత్ స్టార్టర్ పెట్టెల చోరీపై ఎలాంటి చర్యలు చేపట్టారు.?

జవాబు: సర్కిల్ పరిధిలోని వ్యవసాయ తోటల్లో విద్యుత్ పరికరాలు చోరీకి గురైన విషయం వాస్తవమే. చోరీలకు పాల్పడిన దుండగులను పట్టుకున్నాం. వారి నుంచి సుమారు 15 వరకు విద్యుత్ స్టార్టర్ పెట్టెలు రికవరీ చేసి బాధిత రైతులకు అందజేశాం

ప్రశ్న: చోరీల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: చోరీలు జరగకుండా మావంతు కృషి చేస్తున్నాం. రాత్రి సమయాల్లో గ్రామాల్లో పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు.

ప్రశ్న: పలు దేవాలయాల్లో చోరీలు జరిగాయి. రికవరీ ఎంత?

జవాబు : కోటంక, మర్తాడు, శింగనమల తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో రూ. లక్షలు విలువ చేసే బంగారు, వెండి అభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. దొంగలను పట్టుకునిఅభరణాలను రికవరీ చేశాం. చోరీల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: పండ్లతోటల రైతులకు ఎలాంటి సలహా ఇస్తారు?

జవాబు: ప్రస్తుతం వేసవి ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. తోటల్లో ఎక్కడ చూసిన గడ్డి పెరిగిపోయింది. బీడీ, సిగరెట్ అలవాటు ఉన్న వారు పొరపాటున ఆరని అగ్గిపుల్లగాని, బీడీ, సిగరెట్ ముక్కలుగానీ పడివేయడం వల్ల అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. బీడీ, సిగరెట్ అలవాటు ఉన్నవారు జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా రైతులు వేసవిలో వ్యవసాయ తోటల వద్ద ఎండుగడ్డి లేకుండా చేస్తే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు.

క్రమశిక్షణ, ధార్మిక చింతన కలయికే రంజాన్

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పండుగ అని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముస్లింలు పవిత్ర రంజాన్ మా సమంతా ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో గడిపారన్నారు. అల్లా రక్షణ, కరుణ అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. నగరంలోని ఈద్గాలు, మసీదుల్లో రంజాన్ పండుగ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ముస్లింలు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

వసంత నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం


అలంకరణలో అనంతేశ్వరస్వామి, అనంతేశ్వరి మాత

అనంతపురం కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో ఏప్రిల్ ఆరో తేదీ వరకు నిర్వహించనున్న వసంత నవరాత్రి మహోత్సవాలకు ఆది వారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో అనంతేశ్వర సమేత అనంతేశ్వరి మాత మూలవిరాట్లకు ఫల పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులు సామూహికంగా తొమ్మిది పర్యాయాలు మణిద్వీప వర్ణన పారాయణం చేశారు. మహామంగళహారతి, నివేదనానంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.


మణిద్వీప వర్ణన పారాయణం చేస్తున్న భక్తులు

ప్రమాదకరంగా...



శింగనమల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పొలంలోని విద్యుత్ స్తంభానికి చెట్ల తీగలు ఏపుగా అల్లుకుపోయాయి. ప్రస్తుతం ఎండతీవ్రతకు ఎండిపోయి ప్రమాదకరంగా మారింది. మండలంలోని నిదనవాడ గ్రామంలో సుంకులమ్మ గుడి సమీపంలోని ఓ రైతు పొలంలో ఈ పరిస్థితి కనిపిస్తుంది. విద్యుత్ సరఫరా సమయంలో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా కవి సమ్మేళనం

అనంతపురం కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని శ్రీకళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన కవి సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. శ్రీకళాపీఠం చైర్‌పర్సన్ ఉమాదేవి చేతులమీదుగా కవులందరికీ ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కవులు హరి, మధురశ్రీ, గోసల, టీవీ రెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.


కవులను సత్కరిస్తున్న శ్రీకళాపీఠం చైర్‌పర్సన్ ఉమాదేవి

ఉచిత బస్సు సర్వీసు ప్రారంభం



ఉచిత బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న నాయకులు

గుంతకల్లు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం కసాపురం నెట్టికంటి అంజనేయ స్వామి దేవస్థానానికి ఉచిత బస్సు సర్వీసులను టీడీపీ నాయకుడు నారాయణ స్వామి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జయరాం మూడు రోజులపాటు భక్తులు గుంతకల్లు నుంచి కసాపురం వెళ్లేందుకు ఉచిత బస్సు సర్వీసును కల్పించారన్నారు. భక్తులందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, ప్రతాప్ నాయుడు, తలారి మస్తానప్ప, సర్పంచు శ్రీరాములు పాల్గొన్నారు.

అనంతరం వారందరూ కసాపురం ఆలయంలో ప్రత్యేకపూజలు చేయించారు. ఉదయమే ఆలయానికి వెళ్లి ఆంజనేయ స్వామిని దర్శించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అక్కమాంబ జాతర ప్రారంభం

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మూడు రోజులపాటు జరిగే అక్కమాంబ జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ క్రమంలో నిర్వాహకులు అక్కమాంబ ఆలయానికి కలశాన్ని మేళతాళాల మధ్యన ఊరేగింపుగా తీసుకొచ్చారు. పట్టణం చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పానకాలను బిందెలతో తెచ్చి ఆలయంలో అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేపట్టారు.

డ్రోన్లతో నిఘా..

కళ్యాణదుర్గం: పట్టణంలో మూడు రోజుల పాటు సాగే అక్కమాంబ జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో సీఐ యువరాజు సిబ్బందితో కలిసి ప్రత్యేకంగా డ్రోన్లతో ప్రత్యేక నిఘా చేపట్టారు. ఆదివారం పలుచోట్ల డ్రోన్లతో ప్రత్యేక నిఘా వేసి జాతర ఏర్పాట్లను పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఎక్కడైనా రద్దీగా ఉన్నా, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తినా ఈ డ్రోన్ల సాయంతో ఎప్పటికప్పుడు పూర్తిగా తెలుసుకునే అవకాశం ఉంటుందని సీఐ పేర్కొన్నారు.

ఆవుల దాడిలో మసీదు ఇమామ్‌కు తీవ్రగాయాలు

గుత్తి, మార్చి30(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఫుట్‌బాల్ క్రీడామైదానంలో శనివారం రాత్రి ఆవుల దాడి చేసిన సంఘటనలో మసీద్ ఇమామ్ అఫీజ్ బాషా తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన ద్విచక్రవాహనంలో మసీదు వద్దకు వెళ్తుండగా ఆవులు పోట్లాడుకుంటూ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాయి. దీంతో కింద పడ్డ అఫీజ్ బాషాపై ఆవులు దాడి చేశాయి. స్థానికులు గుర్తించి బాధితుడిని కాపాడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురానికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు బందోబస్తు మధ్య ఫయాజ్ ఇంటికి..

తాడిపత్రి, మార్చి30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇంటి నిర్మాణం విషయంలో వారం రోజులక్రితం ఘర్షణకు సంబంధించి వైసీపీ నాయకుడు ఫయాజ్‌బాషాపై కేసు నమోదైన విషయం విధితమే. వాటికి సంబంధించి ఇక్కడ శాంతిభద్రతలకు భంగం కలుగుతుందనే ఉద్దేశంతో రంజాన్ పండుగ అయిపోయేంత వరకు ఎక్కడికైనా వెళ్లాలని పోలీసులు ఆదేశించారు. వాటికి అనుగుణంగా ఫయాజ్‌బాషా తాడిపత్రి విడిచి అనంతపురానికి వెళ్లిపోయారు. రెండురోజులక్రితం అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలకు చెందిన వైసీపీ నాయకులు చర్చించి జిల్లాకేంద్రంలో ఎస్పీని కలిసి ఫయాజ్‌బాషాను రంజాన్ పండుగ సందర్భంగా తాడిపత్రికి పంపించాలని కోరారు. దీతో ఎస్పీ పోలీసు బందోబస్తు మధ్య ఆదివారం ఆయనను ఇంటికి పంపించారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

ఉరవకొండ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ క్రైస్తవ మతబోధకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని పట్టణంలో ఆదివారం క్రిష్టియన్ వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శాంతి ర్యాలీ నిర్వహించారు. తొలుత కొవ్వొత్తులు వెలిగించి ఆయన మృతికి సంతాపం తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ రాజమండ్రి సమీపంలో ఈనెల 25వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి చెందారన్నారు. తొలుత ఇది రోడ్డు ప్రమాదంగా భావించారని, అయితే ఆధారాలను బట్టి అనుమానాస్పద మృతి అనిపిస్తోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర విచారణ చేపట్టి, నిజాలు వెలుగులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు ప్రమీల, సురేష్, లేపాక్షి, క్రిస్ట్ క్రిష్టియన్ వేల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామి పాదాలు తాకిన సూర్యకిరణాలు

గుంతకల్లుటౌన్,మార్చి30(ఆంధ్రజ్యోతి):కసాపురం గ్రామ శివారులో వెలసిన లక్ష్మీనారాయణస్వామి రాతి దేవాలయంలో ఆదివారం స్వామి వారి పాదాలను సూర్యకిరణాలు తాకాయి. ఉగాది సందర్భంగా ఆలయంలో అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని పూజలు చేశారు. గుంతకల్లు పట్టణానికి చెందిన శ్రీనివాస చక్రవర్తి, పద్మశ్రీ దంపతుల కుమారుడు ప్రశాంత్ రూ.35వేలు విలువ చేసే వెండి ఆభరణాలను అందజేశారు. ఆలయ వ్యవస్థాపకులు తలారి పరుశురాముడు, అర్చకులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి తరలిరండి

గుంతకల్లుటౌన్,మార్చి30(ఆంధ్రజ్యోతి): విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏప్రిల్ 2వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ ఫెడరేషన్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణస్వీకారం జరగనుందని, జిల్లాలోని యాదవ కులస్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని యాదవ ఫెడరేషన్ డైరెక్టర్ ఆమ్లెట్‌మస్తాన్‌యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక తన స్వగృహంలో ఆదివారం ఆయన కులస్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

● నిట్టూరు గ్రామస్థుల డిమాండ్



ఫ్యాక్టరీ వద్ద గుమికూడిన నిట్టూరు గ్రామస్థులు

యాడికి, మార్చి30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయరెడ్డిపల్లి గ్రామం వద్ద ఉన్న అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో విధులు నిర్వర్తిస్తూ ప్రమాదంలో గాయపడిన నిట్టూరుకు చెందిన ఉద్యోగి షణ్ముకానందరెడ్డి చికిత్స పొం దుతూ శనివారం మృతిచెందిన విషయం విధితమే. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ నిట్టూరు గ్రామస్థులు ఆ ఫ్యాక్టరీ వద్ద గుమికూడారు. షణ్ముకానందరెడ్డి కుటుంబానికి న్యాయం చేయకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. 2024 డిసెంబరు 18న ఫ్యాక్టరీలోని కూలర్‌లో మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. మరమ్మతులు చేపట్టడానికి వెళ్లిన కార్మికులు కూలర్ తలుపులను ఒక్కసారిగా తెరవడంతో నిప్పు కణికలు ఎగిరి మీద పడ్డాయి. ఈ సంఘటనలో అప్పట్లో ఐదుగురు తీవ్రంగా గాయపడగా.. ఒకరు మృతిచెందారు. తీవ్రంగా గాయపడ్డ షణ్ముకానందరెడ్డిని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ అతను మూడున్నర నెలలుగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. షణ్ముకానందరెడ్డి మృతదేహాన్ని బెంగళూరు నుంచి నిట్టూరు గ్రామానికి తీసుకురానున్న నేపథ్యంలో ఫ్యాక్టరీ వద్ద ఏమి జరుగుతుందోననే ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేయడం కోసం వచ్చిన షణ్ముకానందరెడ్డి బంధువులు, నిట్టూరు గ్రామస్థులతో పోలీసులు సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ ఈరన్న, ఎస్ఐ వెంకటరమణయ్య సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.

వైభవంగా ఉగాది..

● ఊరూరా పండగ వేడుకలు
● ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పామిడిలో ప్రత్యేక అలంకరణలో భోగేశ్వరస్వామి



శెట్టూరులో మహాశివుడు



రాయదుర్గంలో ప్రసన్న వెంకటరమణస్వామి



పెద్దవడుగూరులో లక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: : విశ్వావసు నామ తెలుగు సంవత్సరాది ఉగాది పండగ వేడుకలు అన్ని ప్రాంతాల్లోనూ ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేకువజామునే మహిళలు ఇళ్లను, ముంగిళ్లను శుభ్రం చేసి గుమ్మాలను మామిడితోరణాలు, పూలతో అలంకరించారు. అనంతరం పిల్లలు, పెద్దలు తెలుగుతనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు ధరించి ఇళ్లలో ఇష్ట దైవాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పచ్చడిని స్వీకరించి, పిండివంటలు ఆరగించి సంతోషంగా గడిపారు. తర్వాత ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల్లో వేదపండితులు చేసిన పంచాంగ శ్రవణాన్ని శ్రద్ధగా ఆలకించారు. ఉగాది సందర్భంగా అన్ని ఆలయాల్లోనూ స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణలు, పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. అలాగే ఉత్సవమూర్తులకు పల్లకీ సేవలు, ఊరేగింపులు జరిగాయి. పల్లెల్లో పలు గ్రామీణ క్రీడలు నిర్వహించారు. యువత పలు పందేలల్లో మునిగి తేలారు. ఇక కొన్ని గ్రామాల్లో రైతులు ఉదయాన్నే తమ పొలాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి ఎద్దులతో ఏరువాక సాగును ప్రారంభించారు.



ఉరవకొండలోని పాతపేటలో ఆంజనేయస్వామి ఊరేగింపు



విడపనకల్లులో కాడెద్దులకు పూజలు చేస్తున్న రైతు



గుత్తిమండలం గొందిపల్లిలో ఏరువాకలో భాగంగా గుంటక పాస్తున్న రైతు

ఆలయాల్లో పంచాంగ శ్రవణం



కసాపురం ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న వేదపండితులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: ఉగాది పండుగ సందర్భంగా గుంతకల్లు మండలం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే అర్చకులు, స్వామి వారి మూలవిరాట్‌కు స్వర్ణవజ్రకవచ అలంకరణ చేసి పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో వేదపండితులు పంచాంగ శ్రవణం చేపట్టారు. ఇందులో రాశుల వారిగా ఏ రాశి వారికి ఏ రకమైన బలం ఉంది, ఈ సంవత్సరం ఏ ఏ రకాల పంటలు బాగా పండుతాయి అనే విషయాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వాణి, ధర్మకర్త సుగుణమ్మ, ప్రధాన అర్చకుడు గరుడాచార్యులు, అధికారులు, భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. విడపనకల్లు మండలకేంద్రంలోని గౌరమ్మ ఆలయంలో, రాయదుర్గం పట్టణంలోని ప్రసన్నవెంకటేశ్వరస్వామి, లక్ష్మీనారాయణ స్వామి ఆలయాల్లో, యల్లనూరు మండలకేంద్రంలోని లక్ష్మీ వెంకటరమణస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేశారు. ఇక కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఉగాదిని పురస్కరించుకుని టీడీపీ నేత దేవినేని ధర్మతేజ ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే అమిలినేని ఆధ్వర్యంలో వేదపండితుల చేత పం చాంగ శ్రవణాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై పంచాంగ శ్రవణాన్ని ఆలకించారు. అ నంతరం వేద పండితులను దేవినేని ధర్మతేజ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

మాజీ ఎంపీకి సన్మానం



మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

తాడిపత్రి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డిని ఆదివారం పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, సభ్యులు కలిశారు. ఆయనతో మాట్లాడుతూ యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. మాజీ ఎంపీని కలిసిన వారిలో సభ్యులు నరసింహులు, సుబ్రమణ్యం, రంగయ్య, హనుమంతరెడ్డి, పుల్లారెడ్డి, వెంకటరామయ్య, రమణ తదితరులు ఉన్నారు.

ఉగాది వేడుకల్లో జేసీ కుటుంబం

● ఘనంగా క్రీడాపోటీల నిర్వహణ ● పాల్గొన్న పలు రాష్ట్రాల క్రీడాకారులు



ఇరుసు ఎత్తేపోటీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్



ఇరుసు ఎత్తిన క్రీడాకారుడు



పోటీలను తిలకిస్తున్న జేసీ కుటుంబ సభ్యులు

తాడిపత్రి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సంబరాలను ఆదివారం పట్టణంలో జేసీ కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జేసీ పార్కులో పండుగ వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఇరుసు , ఇసుక బస్తాలు, దింపుడు గుండ్లు ఎత్తే పోటీలతో పాటు సూదీదారం, టగ్ ఆఫ్ వార్, స్పూన్ లెమన్ రియల్లీ రన్నింగ్ వంటి పోటీలు నిర్వహించారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున పోటీల్లో పాల్గొన్నారు. వీటిని తిలకించడానికి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి, టీడీపీ నేత జేసీ పవన్‌రెడ్డితో పాటు ఇతర కుటుంబ సభ్యులు హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్ మాట్లాడుతూ ప్రస్తుతం సాంప్రదాయ పద్ధతులు అంతరించిపోతున్నాయని, ఇప్పటివారికి పండుగ వేడుకల్లో ఇలాంటి పోటీలు ఉన్నాయనేది కూడా తెలియదని ఆవేదన చెందారు. వాటిని తెలియజేయడం కోసమే ప్రతి ఏడాది ఉగాదికి ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. వీటిని చూడడానికి ప్రజలు పెద్దఎత్తున హాజరుకావడం ఎంతో సంతోషమన్నారు. తర్వాత ఇరుసు ఎత్తుపోటీలో మొదట బహుమతి గెలుచుకున్న తిమ్మాపురం గ్రామానికి చెందిన వీరేష్‌కు రూ.25వేలను, రెండో బహుమతి రూ.20వేలను కొండపల్లి రాజుకు, మూడవ బహుమతి చందు, మునేంద్రలకు ఇద్దరికి కలిపి రూ.15వేలను జేసీ కుటుంబసభ్యులు అందజేశారు. ఇరుసు పోటీదారులందరికీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ.2వేలు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత

● త్వరగా పరిష్కారం కాని రెవెన్యూ సమస్యలు
● కార్యాలయం చుట్టూ రైతన్నల ప్రదక్షిణ



కూడేరు తహసీల్దార్ కార్యాలయం

కూడేరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తీవ్ర సిబ్బంది కొరత నెలకొంది. దీంతో రెవెన్యూ సమస్యలు త్వరగా పరిష్కారం గాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో నిత్యం ఆ కార్యాలయానికి ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి కూత వేట దూరంలోనున్న కూడేరు మండలంలో భూముల ధరలు రూ. కోట్లలో ఉన్నాయి. నిత్యం ఇక్కడ భూముల కొనుగోళ్లు, అమ్మకాలు అధికంగా జరుగుతుంటాయి. అయితే ఏదేని రికార్డు సమస్య వచ్చినప్పుడు పరిష్కరించుకోవాలంటే తలనొప్పిగా మారుతోంది. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత వల్ల పనులు త్వరగా కావడం లేదు. గత ఎనిమిది నెలలుగా ఇక్కడ రెగ్యులర్ తహసీల్దార్ లేరు. ఉరవకొండ తహసీల్దార్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అలాగే సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సివిల్ సప్లై డీటీతోపాటు తిమ్మాపురం, కొర్రకోడుగ్రామాలకు వీఆర్వో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఆసక్తి చూపని అధికారులు..

కూడేరు మండలంలో చాలా భూములకు రికార్డులు సక్రమంగా లేకపోవడంతో ఇక్కడికి పోస్టింగ్ అంటేనే అధికారులు ఆసక్తి చూపడం లేదు. గతంలో పని చేసిన ఉద్యోగులు భూములను ఇష్టారాజ్యంగా ఆన్‌లైన్‌లో చేర్చారు. దీంతో విచారణ చేయగా.. కొందరు ఉద్యోగులు సస్పెన్షకు గురయ్యారు. దీంతో ఈ మండలంలో పనిచేయడానికి రావాలంటే మొహం చాటేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక రెగ్యులర్ తహసీల్దారుగా మోహన్‌కుమార్‌ను నియమించింది. అతను జాయిన్ కాలేదు. బెళుగుప్ప మండల ఆర్ఐ నగేష్ కూడా కూడేరుకు బదిలీపై వచ్చిన కొద్ది రోజులకే సెలవుపై పరుగులు తీశారు. ఇటీవల కంప్యూటర్ ఆపరేటర్ కూడా నెల రోజులుగా కార్యాలయం వైపు కన్నెత్తి చూడలేదు. ఇక వీఆర్ఓలు, సీఎస్ డీటీలు సైతం ఎవరూ ముందుకు రాకపోవడంతో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది.

వీఆర్ఏల బదులు కుటుంబ సభ్యులు..

మండలంలోని వివిధ రెవెన్యూ గ్రామాలకు చెందిన వీఆర్ఏ (విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్) స్థానంలో వారి కుటుంబ సభ్యులు చలామణి అవుతూ కార్యాలయంలోనే నిత్యం ఉంటూ బ్రోకర్ల అవతారం ఎత్తినట్లు ప్రచారం జరుగుతోంది. గత కొంత కాలంగా కార్యాలయంలో తిష్టవేసిన బినామీ వీఆర్ఏలు రాజకీయ పార్టీలకు కొమ్ముకాస్తూ కార్యాలయాలకు వచ్చే రైతుల అర్జీలను పరిశీలించి ప్రత్యర్థి పార్టీలకు చేరవేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏది ఏమైన కూడేరు తహసీల్దారు కార్యాలయం లో ఉద్యోగం చేయడానికి రావాలంటే కత్తిమీద సాములా ఉంటోంది.

పోస్టుల భర్తీ ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది..

కూడేరు తహసీల్దారు కార్యాలయంలో పోస్టుల భర్తీ ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. అనారోగ్యానికి గురైన వీఆర్ఏల స్థానంలో వారి కుటుంబ సభ్యులు ఉద్యోగం చేయడానికి ఆరు నెలల పాటు ఆర్డర్ ఉంటుంది. తర్వాత రెగ్యులర్ వారు ఉద్యోగం చేయాల్సి ఉంటుంది.

-మహబూబ్‌బాషా, ఇన్‌చార్జి తహసీల్దార్

వైభవంగా రాములోరి కల్యాణం



ప్రత్యేకాలంకరణలో సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులు

యాడికి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలోని రామస్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ కల్యాణాన్ని అంగరంగవైభవంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే రాయలచెరువులో చెన్నకేశవస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తాడిపత్రి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పొలిమేర పెద్దమ్మ, సుంకులమ్మపాలెంలోని సుంకులమ్మ, కృష్ణాపురంరోడ్డులోని గంగమ్మ , నందలపాడు పెద్దమ్మ ఆలయాల్లో ఉగాది సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఉదయమే పూజారులు ఆలయంలోని అమ్మవార్ల మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సుంకులమ్మ పాలెంలో స్థానికులు మంగళవాయిద్యాలతో , పందేరపు బండ్లతో పెద్దఎత్తున స్థానిక పెన్నానదికి వెళ్లి జలధిని నిర్వహించారు.

నామమాత్రంగా సామాజిక తనిఖీలు: టీడీపీ

ఉరవకొండ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీలను అధికారులు నామమాత్రంగా నిర్వహిస్తున్నారని టీడీపీ మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు ఆరోపించారు. పట్టణంలోని మండిలో ఆదివారం ఆయన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వజ్రకరూరు మండలంలో సామాజిక తనిఖీలను అధికారులు తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారన్నారు. గ్రామసభలో పనులు ప్రస్తావించకుండా, తనిఖీ వివరాలు వెల్లడించకుండా ఒట్టి తీర్మానాలు చేసుకుని వెళ్తున్నారన్నారు. ఉపాధి పథకాన్ని వైసీపీ నాయకులు ఆదాయయవనరులుగా మార్చుకుని, బినామీ పేర్లతో డబ్బులు కాజేశారని విమర్శించారు. పథకంలో జరిగిన అవకతవకలపైన జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు నాగేంద్ర, వన్నూరుస్వామి, నాగన్న, శ్రీరాముల పాల్గొన్నారు.

నిస్వార్థ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు



ర్యాలీలో పాల్గొన్న సంస్థ సభ్యులు, చిన్నారులు

ఉరవకొండ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా సేవలందిస్తున్న పలువురిని పట్టణంలోని నిస్వార్థ సేవా సంస్థ వారు ఉగాది పురస్కారాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా తొలుత సంస్థ సభ్యులు, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో ర్యాలీ చేపట్టారు. ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. తర్వాత సేవా సంస్థల వారికి ఉగాది పురస్కారాలను అందించారు. కరణం శ్రీనివాసరావు పంచాంగ శ్రవణం చేవారు. కార్యక్రమంలో గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్ర స్వామి, రూరల్ సీఐ చిన్నగౌస్, నిస్వార్థ సేవా సంస్థ సభ్యుడు వెంకట్ పాల్గొన్నారు.

దగ్ధమైన మామిడితోట పరిశీలన

కంబదూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూళ్యం గ్రామంలో రైతు వెంకటేశులుకు చెందిన 20 ఎకరాల్లో మామిడితోట గత శనివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దగ్ధమైన విషయం తెలిసిందే. కాగా ఆదివారం టీడీపీ నేత దేవినేని ధర్మతేజ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆ తోటను పరిశీలించారు. 20 ఎకరాల్లో కాలిపోయిన మామిడి చెట్లు, డ్రిప్పు పరికరాలు, 20 చింతచెట్లతో సహా పరిశీలించారు. ధైర్యంగా ఉండాలని బాధితుడికి అభయమిచ్చారు. ఇందుకు కారణమైన వారిని వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. టీడీపీ మండల కన్వీనర్ కే.శివన్న, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

7 నుంచి చౌడేశ్వరిదేవి జాతర

రాయదుర్గంరూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం, పల్లేపల్లి గ్రామాల సమీపంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద ఏప్రిల్ 7 నుంచి 9వ తేదీ వరకు జాతర నిర్వహించనున్నట్లు ఆ యా గ్రామాల పెద్దలు ఆదివారం ప్రకటనలో తెలిపారు. 9 సంవత్సరాలకు ఒకసారి ఇక్కడ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఎంపీటీసీ సభ్యుడి మృతి

కూడేరు, మార్చి 30, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చోళసముద్రం ఎంపీటీసీ సభ్యుడు నాగభూషణం (60) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందారు. మృతదేహాన్ని ఎంపీపీ నారాయణ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

రైలు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

గుత్తి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఐ కాలనీ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద రైలు ఢీకొని సూర్య అనే యువకుడికి తీవ్రగాయాలైనట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మండలంలోని బాచుపల్లి గ్రామానికి చెందిన సూర్య శనివారం రాత్రి హియర్‌ఫోన్ పెట్టుకొని రైల్వే ట్రాక్‌పై వెళ్తున్నాడు. అయితే రైలువచ్చే శబ్దం వినిపించకపోవడంతో ప్రమాదవశాత్తు రైలు ఢీకొంది. దీంతో తీవ్రగాయాలవడంతో స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురానికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మామిడితోట కంచెకు నిప్పు

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపురంలో ఆదివారం మామిడి తోట కంచె దగ్ధమైంది. గుర్తుతెలియని వ్యక్తులు తన మామిడి తోట కంచెకు నిప్పు పెట్టినట్లు బాధిత రైతు డీకే రామాంజినేయులు తెలిపారు. అటుగా వెళ్లిన వారు గమనించి వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. కంచెతో పాటు రెండు మామిడి చెట్లు కలిపోయినట్లు బాధిరైతు వాపోయారు.